సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం, 6, డిసెంబర్, 2022

వాహ్ తాజ్..!



ఆంధ్రా కశ్మీర్‌గా పేరొందిన చింతపల్లి మండలం శీతల ప్రాంతం లంబసింగిలో తాజ్‌మహల్ నిర్మితమైంది. పర్యాటకుల తాకిడి అధికంగా ఉన్న తాజంగి రిజర్వాయర్ మార్గంలో ఆకర్షణీయంగా ఓ ప్రైవేట్ రిసార్ట్ నిర్వాహకులు వాహ్ తాజ్ అనేలా దీనిని నిర్మించారు.

- సాక్షి, పాడేరు



కష్టపడి పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు 8లో

న్యూస్‌రీల్

అగ్రి టూరిజంకు గుర్తింపు

- చింతపల్లి ఆర్ఏఆర్ఎస్‌కు మూడవ స్థానం
- ఏడీఆర్ సురేష్‌కుమార్



బహుమతి అందుకుంటున్న చింతపల్లి శాస్త్రవేత్తలు

చింతపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రూపొందించిన అగ్రి టూరిజం ప్రాజెక్టుకు మూడవ బహుమతి లభించినట్లు ఏడీఆర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం గుంటూరు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బహుమతి అందుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈనెల 3 నుంచి ఐదవ తేదీ వరకు లాంఫం అగ్రీ టెక్- 2022 ప్రదర్శన నిర్వహించారు.దీనిలో అగ్రి టూరిజానికి సంబంధించి మూడవ బహుమతికి ఎంపికైనట్టు ఆయన వివరించారు. సోమవారం వ్యవసాయ యాంత్రీకరణ, ఆహార ఇంజీనీరింగ్‌లో వినూత్న సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ విస్తరణ సేవలు అంశంపై సదస్సు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పరిశోధన స్థానంలో వివిధ రకాల పూల మొక్కలను ప్రయోగాత్మకంగా సాగు చేపట్టి మంచి ఫలితాలు సాధించిన వాటిని ప్రదర్శనలో ఉంచామన్నారు. దీనికి మూడవ బహుమతి రావడంపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో 'కొయ్యూరు' ప్రతిభ

- ఆరుగురికి బంగారు పతకాలు
- జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



పతాకాలతో కొయ్యూరు కుస్తీ అకాడమి విద్యార్థులు

కొయ్యూరు: గిరిజన విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో సత్తా చాటారు.తిరుపతి సమీపంలోని రేణిగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 3నుంచి5 వరకు నిర్వహించిన పోటీల్లో పాడేరు ఐటీడీఏ తరపున పాల్గొన్న కొయ్యూరు కుస్తీ అకాడమి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆరు పతకాలు సాధించారు. జాతీయ పోటీలకు అర్హత సాధించారు. 57 కిలోల విభాగంలో ఎం రాంబాబు (గోల్డ్), 60కిలోల విభాగంలో కె.రాజుబాబు (బ్రాంజ్),70 కిలోల విభాగంలో వి.ప్రసాద్ (గోల్డ్), 65 కిలోల విభాగంలో పి.రమేష్, సీహెచ్ మహేష్, కె.దేవమ్మ, పి.నిర్మల బంగారు పతకాలు సాధించారు. ఎల్ హరిచంద్ర వెండి పతాకాన్ని పొందారని కుస్తీ అకాడమి ఇన్‌చార్జి పీడీ అంబటి నూకరాజు తెలిపారు.

శిక్షణ ఎంపికకు 7న ప్రవేశపరీక్ష

జి.మాడుగుల: ఎస్ఎస్‌సీ, జీడీ పోస్టులకు కోసం దరఖాస్తు చేసుకున్న గిరిజన అభ్యర్థులకు శిక్షణ నిమిత్తం ఈనెల ఏడవ తేదీన మండలంలో జీఎం కొత్తూరు ఆశ్రమోన్నత పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎస్ఎస్‌సీ, జీడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోనివారు నేరుగా దరఖాస్తు చేసుకొని పరీక్షకు హాజరుకావచ్చని వారు పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు జిల్లా పోలీస్‌శాఖ స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో ఉచితంగా ఫిజికల్, రాత పరీక్షకు తగిన శిక్షణ అందిస్తామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్ష కేంద్రం వద్ద భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు వారు అన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

సాక్షి, పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు కోర్సులలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నామని ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి తెలిపారు. బీఏ జర్నలిజం కోర్సులో 16 సీట్లు, బీఎస్సీ వెబ్ టెక్నాలజీలో 27, సీడ్ టెక్నాలజీలో 22 సీట్లు ఉన్నాయని ఆయన వివరించారు. ఒరిజినల్ ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలకు హాజరుకావాలని, ఈనెల 7వతేదీ వరకు స్పాట్ అడ్మిషన్లకు గడువు ఉందని ఆయన తెలిపారు.

కాశీపట్నం వంగకు.. భలే డిమాండ్



కాశీపట్నం వంకాయ అంటేనే ఇష్టపడని వారుండరు. భోజన ప్రియులు చెవికోసుకుంటారు. రుచికరంగా ఉండడంతో మన్యంతో పాటుగా మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్. కాశీపట్నం పరిసర గ్రామాల్లో పండిస్తున్న వంగను ఉత్తరాంధ్ర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో కాశీపట్నంలో బుధవారం జరిగే వారపు సంత కళకళలాడుతోంది.



కాశీపట్నంలో వంగతోట

- పోటీపడి కొనుగోలు
- వారపు సంతలో భారీగా వ్యాపారం
- ఉత్తరాంధ్ర జిల్లాలకు తరలిస్తున్న వ్యాపారులు
- పూర్వీకుల నుంచి దేశవాళీ రకం సాగు



కాశీపట్నం పంచాయతీ మండపరి గ్రామానికి చెందిన ఈమె పేరు బుచ్చమ్మ. ఎకరా భూమిలో సాగు చేపట్టి మంచి దిగుబడి సాధించింది. ప్రస్తుతం బుట్ట వంకాయలు రూ.500 నుంచి రూ.600 ధరకు విక్రయిస్తోంది. ఎకరాకు రూ.10 వేల వరకు ఆదాయం పొందుతోంది. ఈమె మాదిరిగానే కాశీపట్నం పరిసర ప్రాంతాలైన చిలకలగెడ్డ, గుమ్మకోం, ఎన్ఆర్‌పురం, భీంపోల్, గురుగుబిల్లి గ్రామాలకు చెందిన రైతులు కాశీపట్నం వంగను సాగు చేసి మంచి ఆదాయం పొందుతున్నారు.

అనంతగిరి: కాశీపట్నం వంగకు అంతాఇంతా డిమాండ్‌కాదు. ఈ సాగు చేపట్టిన రైతులు నష్టపోయిన సందర్భాలు లేవంటే అతిశయోక్తికాదు. ప్రతీ బుధవారం కాశీపట్నంలో జరిగే వారపు సంతకు కాశీపట్నంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు వంగను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం సీజన్ కావడంతో కాశీపట్నం వంగతో వారపు సంత కళకళలాడుతోంది.

ఎకరాకు రూ.15 వేల వరకు ఆదాయం

అరకు–విశాఖ ప్రధాన రహదారిని అనుకుని చిరు వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా కాశీపట్నం వంకాయలను విక్రయిస్తుంటారు. రోడ్డును ఆనుకొని వారపు సంత ఉన్నందున వినియోగదారులు, పర్యాటకులకు అనువు ఉంటుంది. అందువల్ల పెద్ద ఎత్తున వ్యాపారం జరుగుతోంది. అక్టోబర్ నుంచి జనవరి వరకు కాపు ఉంటుంది. అక్టోబర్, నవంబర్ నెలల్లో నెలలో టన్ను మేర సంతలో విక్రయాలు జరుగుతాయి. పెట్టుబడి పోను ఎకరాకు రూ.10 నుంచి రూ.15 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు.

సేంద్రియ విధానంలో సాగు

ఖరీఫ్ సీజన్‌లో సేంద్రియ విధానంలో వంగను పండిస్తున్నారు. ఇసుకతో కూడిన ఎర్ర నేలలో బాగా దిగుబడి వస్తుంది. సాధారణ మొక్క కన్నా ఇక్కడ సాగు చేసే వంగ మొక్కలు గుబురుగా పెరుగుతాయి. ఒక్కో వంకాయ సైజు సుమారు 200 గ్రాముల పైబడే ఉంటుంది. సాధారణ వంగ సాగుకు నీరు అధికంగా ఉండాలి. ఇక్కడ సాగుచేసే వంగకు అధిక నీరు అవసరం లేదు. పంట కాలం మూడు నెలల ఉంటుంది.. గిరిజనులు సొంతగానే నార తీసి పొలంలోని వేస్తారు. 45 రోజులు గడిచిన తరువాత కాపు ప్రారంభమవుతుంది.

వంగ సాగు వివరాలు

గ్రామం	ఎకరాలు
కాశీపట్నం	60
చిలకలగెడ్డ	20
గుమ్మకోట	30
ఎన్ఆర్‌పురం	10
భీంపోల్	30
గరుగుబిల్లి	10

ఇదీ ప్రత్యేకత

కాశీపట్నం పరిసర ప్రాంతాల్లో పండించే వంగ రకానికి ముళ్ల ఉంటాయి. అంతేకాకుండా ముక్క గట్టిగా ఉంటుంది. కూర తయారు చేసిన తరువాత కూడా జావకాకుండా ముక్క మాదిరిగానే ఉండటం దీని ప్రత్యేకత అని రైతులు తెలిపారు. దేశవాళీ రకంగా వారు చెబుతున్నారు. పూర్వీకుల నుంచి ఇదే రకాన్ని సాగు చేస్తున్నామని వారు వివరించారు. సేంద్రియ విధానంలో సాగు వల్ల పోటపడి కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు.

వంగను పండించే గ్రామాలు : కాశీపట్నం, ఎన్ఆర్ పురం, భీంపోల్, గుమ్మకోట, చిలకలగెడ్డ, గరుగుబిల్లి పంచాయతీల్లో సారవానిపాలెం, సీతంపేట, నందకోట, మండపర్తి, పల్లంవలస, దాసరితోట, జీలుగులపాడు, బిల్లకోట, గుజ్జిలి, గొట్లిపాడు, తదితర గ్రామాల్లో గిరిజనులు వంగ సాగు చేస్తారు. ఆయా ప్రాంతాల్లో భూములు ఈ పంటకు అనుకూలంగా ఉంటూ, దిగుబడి బాగ వస్తుందని ఉద్యానవనశాఖ అధికారులు తెలిపారు.

డిమాండ్ పెరిగింది



గతంతో పోలిస్తే కాశీపట్నం వంకాయకు డిమాండ్ పెరిగింది. మా గ్రామంలో పెద్ద ఎత్తున వంగ సాగు చేస్తున్నాం. గత నాలుగు వారాల నుంచి సంతలో మంచి ధర లభించింది.ఈ వారం ధర బాగానే ఉంది. పండించినందుకు ప్రతిఫలం దక్కింది.

– రాము, గిరిజన రైతు, కాశీపట్నం

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- ఎస్పీ సతీష్‌కుమార్ సూచన
- పోసమ్మ గండి టూరిజం కంట్రోల్ రూమ్ తనిఖీ



బోట్ పాయింట్ వద్ద కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

దేవీపట్నం: పాపికొండల విహార యాత్రకు వెళ్లే పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన పోసమ్మ గండి వద్ద టూరిజం కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా పర్యాటకుల భద్రతకు చేపట్టిన ప్రమాణాలను పరిశీలించారు. పర్యాటకులంతా లైఫ్ జాకెట్లు కచ్చితంగా ధరించేలా చూడాలన్నారు. అలాగే బోట్ సరంగులను పరిశీలించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది అత్యంత బాధ్యతగా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం బోట్‌లో కొంతదూరం విహరించి ప్రత్యక్షంగా ఏర్పాట్లను పరిశీలించారు.

అనంతరం పోసమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.కార్యక్రమంలో సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఐటీ రికవరీ బాధ్యత డీడీవోలదే

జిల్లా ఖజానాధికారి ప్రసాదబాబు



మాట్లాడుతున్న ప్రసాదబాబు

సాక్షి,పాడేరు: ప్రతి నెలా జీతాల బిల్లుల్లో ఆదాయపు పన్ను తగ్గించాల్సిన బాధ్యత డీడీవోలదేనని జిల్లా ఖజానాధికారి ఆర్.ప్రసాదబాబు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం పలుశాఖలకు చెందిన డీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాన్ రిజిస్ట్రేషన్ చేయించుకుని, సిబ్బంది జీతభత్యాల నుంచి ఆదాయపు పన్ను రికవరీ చేయవచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వ క్వార్టర్‌లో అద్దెకు ఉంటే హెచ్‌ఆర్‌ఏ ఇవ్వకూడదన్నారు. ఐటీ రికవరీకి సంబంధించి రూ.1.5 లక్షల వరకు సేవింగ్స్ ఉంచుకోవచ్చన్నారు. రూ.50వేల వరకు స్టాండర్డ్ డిడక్షన్ ఉంటుందన్నారు. ఆదాయం రూ.2లక్షల 50వేల నుంచి రూ.5లక్షల వరకు ఆదాయం ఉంటే 5శాతం, రూ.5లక్షల నుంచి రూ.10లక్షల ఉంటే 10శాతం, రూ.10లక్షలు దాటిన వారికి 30శాతం ఐటీ రికవరీ చేయాలన్నారు. హౌసింగ్ రుణాలకు సంబంధించి రుణాలు పొందితే సంబంధిత బ్యాంకు ద్వారా వడ్డీ ధ్రువపత్రాన్ని ఐటీ రికవరీలో తెలియచేయాలని ఆయన సూచించారు.

కొనసాగుతున్న చలిగాలులు

- మినుములూరులో 11..
- చింతపల్లిలో 16.8..
- అరకులోయలో 18 డిగ్రీలు నమోదు



పాడేరు ఘాట్‌లో మంట కాగుతున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో చలిగాలులు కొనసాగుతున్నాయి.పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 11డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రత సోమవారం నమోదైంది. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 16.8, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 18 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పాడేరు, అరకులోయ ,చింతపల్లి ప్రాంతాల్లో పొగ మంచు కురిసింది.లంబసింగి, చెరువులవేనం ప్రాంతాల్లో ఉదయం 10 గంటల వరకు మంచుతెరలు వీడలేదు. సోమవారం సాయంత్రం నుంచి ఘాట్ ప్రాంతాల్లో చలిగాలులు విజృంభించాయి. పర్యాటకులు మాత్రం ఏజెన్సీలో మంచు,ఇతర ప్రకృతి అందాలను వీక్షించేందుకు రోజు భారీగానే తరలివస్తున్నారు.స్థానిక ప్రజలతో పాటు,పర్యాటకులు కూడా చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

ముమ్మరంగా తనిఖీలు



వై.రామవరం వారపు సంతలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రాంబాబు

వై.రామవరం: మండల కేంద్రమైన వై.రామవరంలో సోమవారం జరిగిన వారపు సంతలో అడ్డతీగల సీఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మండల లోతట్టు ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలను, వాటిలో రవాణా చేస్తున్న సామగ్రిని ఆయన తనిఖీ చేశారు. అనుమానితులు, అపరిచితులపై గట్టి నిఘా ఉంచారు. ఎస్ఐ ఎం. సంతోష్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, స్టేషన్ సిబ్బంది, మహిళాపోలీసులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: తనిఖీల సమయంలో పోలీసులకు ప్రజలంతా సహకరించాలని ఎస్ఐ రవీంద్ర కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: దట్టమైన మంచు, వణికిస్తున్న చలిలో మారుమూల మద్దిగరువు పరిసర ప్రాంతాలు, పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి, నుర్మతి రోడ్లల్లో రాకపోకలు సాగించే వాహనాలను సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ పోలీస్ బృందాలు తనిఖీ చేశాయి.

వేతనాల పెంపుపై హర్షం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి వైన్ షాపు సిబ్బంది పాలాభిషేకం



చింతపల్లిలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది



పాడేరులో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వైన్ షాపు సిబ్బంది

పాడేరు రూరల్ : వేతనాల పెంపుపై ప్రభుత్వ వైన్ షాపుల్లో పని చేస్తున్న సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పాడేరు పట్టణంలో ఓ ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద ఏపీఎస్‌బీసీఎల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైన్ షాపుల్లో పని చేస్తున్న సేల్స్‌మన్లు, సూపర్‌వైజర్లు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమంతో పాటు కార్మికులు, ఉద్యోగుల వేతనాలు పెంచి వారి జీవితాల్లో సంతోషాలు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ టి. నర్సింగరావు అన్నారు. వైన్‌షాపుల్లో పనిచేసే ఉద్యోగులు సీఎం జగన్‌ను రుణపడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైన్ షాపు సిబ్బంది బోనంగి వెంకటరమణ, శివ, మోహన్, న ర్సింగ్, దిలీప్ పాల్గొన్నారు.

చింతపల్లి: మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న తమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వేతనాలు పెంచడం అభినందనీయమని చింతపల్లి సర్కిల్ ఏపీఎస్‌బీసీ ఉద్యోగులు అన్నారు. వేతనాలు పెంచినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సూపర్ వైజర్ శ్రావణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం వలన ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభించిందన్నారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మోరి రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషా దేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ పుష్పలత, సూపర్ వైజర్లు వెంకటేష్, చిన్నా, హరికృష్ణ పాల్గొన్నారు.

జగన్‌తోనే బీసీలకు న్యాయం



జయహో బీసీ సదస్సు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చొక్కాకుల వెంకటరావు, భాగ్యలక్ష్మి తదితరులు

- ఆయన హయాంలో మెరుగుపడిన సామాజిక, ఆర్థిక స్థితిగతులు
- వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- విజయవాడలో జయహో బీసీ సదస్సు రేపు
- విజయవతం చేయాలని పిలుపు

పాడేరు రూరల్ : రాష్ట్రంలో గత ప్రభుత్వాలు బీసీలకు తీరని అన్యాయం చేశాయని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక బీసీ కులాల జీవన, ఆర్థిక, సామాజిక స్థితిగతులు పూర్తిగా మారాయని వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు అన్నారు. సోమవారం స్థానిక మోదకొండమ్మ ఆలయం కల్యాణ మండలంలో బీసీ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సంక్షేమం కోసం ఏకంగా 56 బీసీ కులాల కోసం ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. గత పాలకులంతా బీసీలను ఓటు బ్యాంకుగానే మార్చుకున్నారన్నారని, వారి జీవన ప్రమాణాలు మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు తమ మద్దతు తెలిపేందుకు బీసీల ఐక్యతను చాటి చెప్పేందుకు ఈనెల 7న విజయవాడలో నిర్వహిస్తున్న జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బీసీల ఆర్థిక ప్రగతి, జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు బీసీ కులాలంతా మద్దతుగా నిలవాలన్నారు. బీసీల కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తోందన్నారు. జయహో బీసీ మహాసభ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. చొక్కాకుల వెంకటరావు మోదకొండమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆయనను ఎమ్మెల్యే దంపతులు సత్కరించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్‌మీరా, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చిటికెల సత్యవతి, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు, పాడేరు ఎంపీపీ సొనారి రత్నకుమారి, చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, పలు బీసీ సంఘాల నాయకులు సత్యనారాయణ, గోపి, నాగేశ్వరరావు, కృష్ణారావు, ఈశ్వరరావు, రామరాజు, వి. మూర్తి, వరహాలు, బందారి ముసలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాలతో గిరి యువతకు ఉపాధి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్

సాక్షి,పాడేరు: శిక్షణా కేంద్రాల ఏర్పాటు ద్వారా గిరిజన యువతీ,యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. పాడేరు పట్టణ పరిధిలో రూ.50లక్షల కేంద్ర ప్రత్యేక సహాయ నిధులతో ఐటీడీఏ నిర్మించనున్న ఉపాధి శిక్షణ కేంద్ర భవన నిర్మాణ పనులకు సోమవారం ఆయనతోపాటు,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ వి.అభిషేక్ భూమి పూజ చేసి, శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యతో పాటు, స్వయం ఉపాధి అవకాశాలు పొందలేక ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి,స్వయం ఉపాధికి చర్యలు తీసుకోవడం శుభపరిణామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి,సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగా తాగునీటి పథకాలు

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న తాగునీటి పథకాల పనులు నాణ్యతగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. నిర్మాణాల్లో ఎక్కడ సబ్ కాంట్రాక్టర్ వ్యవస్థ ఉండకూడదన్నారు. ఇచ్చిన పనులను మూడు నెలల్లోగా పూర్తి చేయకపోతే,టెండర్లు రద్దు చేసి,కొత్త టెండర్లు పిలుస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. తాగునీటి పథకాల పనులన్నిటంటినీ వారంరోజుల్లో ప్రారంభించాలన్నారు ఈఈ లీలాకృష్ణ, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

ఈనెల 7న పరిశీలకులతో సమావేశం

ఈనెల 7వతేదీ ఉదయం ఉత్తరాంధ్ర జిల్లాల ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు ఎ.బాబు జిల్లా కేంద్రంలో పర్యటిస్తున్నందున కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి, అన్ని రాజకీయ పార్టీల నేతలు హాజరుకావాలని ఆయన కోరారు.

పారదర్శకంగా భూముల రీసర్వే

జిల్లాలో నిర్వహిస్తున్న భూముల రీసర్వేను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో రెవెన్యూ అధికారులు,రీసర్వే ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా సమీక్షించారు.రీసర్వే సమమంలోనే మ్యుటేషన్లు చేపట్టాలన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి జిల్లాలో భూముల రీసర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు.జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో, ,సబ్‌కలెక్టర్ పాల్గొన్నారు.

రూ.500కోట్ల మేర రుణాలివ్వాలి: గిరిజన రైతులకు రూ.500కోట్ల మేర రుణాలు పంపిణీ చేసి, వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ,కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి సంబంధించి పలుశాఖల అధికారులు, డీఆర్‌డీఏ,పలు బ్యాంకుల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు.

పందెంరాయుళ్ల అరెస్టు

చింతపల్లిరూరల్: మండలంలోని తాజంగి పంచాయతీ బలబద్రం సమీపంలో కోడిపందాలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను సోమవారం అరెస్టు చేశామని ఎస్‌ఐ మహమ్మద్ షరీఫ్ అలీ తెలిపారు. కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం అందటంతో తమ బలగాలతో దాడులు నిర్వహించామన్నారు. ఆరుగురు వ్యక్తులు, 15 కోడిపుంజులు,24 ద్విచక్ర వాహనాలు ,ఒక ఆటో ,రూ.5260 నగదు పట్టుపడిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలు సమస్యలపై దరఖాస్తులను రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో 60 వరకు వివిధ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఐటీడీఏ ఏపీఓ(జనరల్) సీహెచ్ .శ్రీనివాస్‌రావు, ఈఈలు డేవిడ్‌రాజ్, యూసఫ్, నాగేశ్వరరావు, ఏపీడీ శ్రీనివాస్‌రావు, డీఎల్‌పీఓ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నగేష్ మాట్లాడుతూ ఆపదలో అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ మాట్లాడుతూ అపోహలు వీడి మహిళలు కూడా రక్త దానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. అన్ని దానాల కంటే రక్త దానం గొప్పదన్నారు. తహసీల్దార్ ముజీబ్, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగరాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్విని, మేనేజింగ్ కమిటీ సభ్యులు లోహితాస్, సిబ్బంది అప్పారావు, రాజు, వెంకట్, కోటేశ్వరరావు, గ్రామ సచివాయ ఉద్యోగులు పాల్గొన్నారు.



శిబిరంలో ఎంపీడీవో నగేష్, అధికారులు

వారంలో ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

అడ్డతీగల: అధికారుల దృష్టికి వచ్చిన ఫిర్యాదులకు వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శుభం బన్సల్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 22 అర్జీలను వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు సబ్‌కలెక్టర్‌కి అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ వివేక్, ఐసీడీఎస్ సీడీపీవో దీప్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

వీఆర్ పురం: రేఖపల్లి ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో సోమవారం విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ ఎస్.గీతాప్రసాద్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడూతూ అగ్నిప్రమాదం సంభవించినపుడు భయపడకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు. నివారణ చర్యలను వివరించారు. ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ గాంధీబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ గీతాప్రసాద్

నేడు స్కిల్‌హబ్ ప్రారంభం

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్‌హబ్ కేంద్రాన్ని మంగళవారం ఉదయం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

కష్టపడి పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



పాడేరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్: పార్టీని నమ్ముకుని విధేయుడిగా ఉంటూ పార్టీ పటిష్టత కోసం పనిచేసే సామాన్య కార్యకర్తకు సైతం వైఎస్సార్‌సీపీ నుంచి తగిన గుర్తింపు ఉంటుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకరణ కార్యక్రమం సుంద్రుపుట్టు మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌గా నియమితులైన కూతంగి సూరిబాబు, వైస్ చైర్మన్ బట్టి కొండబాబు, డైరెక్టర్లు గబ్బాడ రాజారావు, ఉల్లి కామేశ్వరరావు, కూడా కొండబాబు, లకే రామసత్యవతి, కుమ్మరి సుశీల, రేగం విజయశాంతి, జంపరంగి పద్మకుమారి, కోరాబు కాంతమ్మ, వేముల వరలక్ష్మి, కోడా పెద్దమ్మి, సందోలి కొండబాబులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడారు. రైతే రాజు అని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయం కోసం కొత్తకొత్త పథకాలను ప్రవేశపెట్టి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ యార్డులను బలోపేతం చేస్తోందన్నారు. నూతన పాలకవర్గాన్ని ఆమె ఘనంగా సత్కరించారు. సాయిబాబా ఆలయం నుంచి మెయిన్ బజారు మీదుగా పాడేరు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత సీఎం వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైస్ ఎంపీపీ కె. కనకాలమ్మ, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, సల్లా చిట్టమ్మ, లకే రామకృష్ణపాత్రుడు, కుంతూరు నర్సింహమూర్తి, దూసురి సన్యాసయ్య, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, గబ్బాడ చిట్టిబాబు, వంతాల బొంజుబాబు, పాంగి రాంబాబు, గొల్లోరి నీలకంఠం, వనుగు బసవన్న దొర, గుల్లెలి అశ్విజ, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే విజయం సొంతం

గంగవరం : గిరిజన విద్యాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో నాబార్డు నిధులు రూ.63లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చిన సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను ఎమ్మెల్యే ధనలక్ష్మి శాలువాతో సత్కరించి, అభినందించారు. పీడీ నాగమణి, పీఈటీ పద్మావతి, హెచ్‌ఎం ఝాన్సీహేనస్, ఉపాధ్యాయులను అభినందించారు. క్రీడల్లో, విద్యలో మరింత ప్రగతిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబిరత్నం, సర్పంచ్ అక్కమ్మ, వైస్ ఎంపీపీలు గంగాదేవి, రామతులసి, కో–ఆప్షన్ సభ్యుడు ప్రభాకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ మల్లేశ్వరరావు, డిప్యూటీ వార్డెన్ లక్ష్మీకాంత, నాయకులు పాల్గొన్నారు.



గంగవరంలో క్రీడాకారులను సన్మానిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



క్రీడాకారులను అభినందిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా పాడేరులో జరిగిన నియోజకవర్గస్థాయి ఆటల పోటీల్లో స్థానిక విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఆయా క్రీడాకారులు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను కలిశారు. వారిని పీవో అభినందించారు.

భోజన పథకం పక్కదారి పడితే చర్యలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక
- నాణ్యమైన మెనూ అమలు చేయాలని సమీక్షలో సూచన

సాక్షి,పాడేరు: ప్రభుత్వ విద్యాలయాల్లో మధ్యాహ్న భోజన పథకం పక్కదారి పడితే ఉపేక్షించేది లేదని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు నియోజకవర్గ పరిధిలోని ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు, గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాలయాల్లో నాణ్యమైన బోధన, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజనం, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో నాణ్యమైన మెనూ అమలుపై కలెక్టర్,ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ సమీక్షించారు.పాఠశాలలను తనిఖీ చేయాలని ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలను ఆదేశించారు. పాఠశాలల్లో చేయకూడనివి, ఉపాధ్యాయులు చేయాల్సిన పనులపై హెచ్‌ఎంలకు సర్క్యులర్లు వెంటనే జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అధికారులంతా విద్యాలయాల్లో స్టోర్‌రూమ్‌లను తనిఖీ చేయాలని, నాణ్యమైన నిత్యావసర సరుకులు పంపిణీకి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్లకు తీసుకువెళితే వారిదే బాధ్యత వహిస్తామని తెలిపే విధంగా లేఖలు తీసుకోవాలన్నారు. పాఠశాలల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత బాధ్యులకుఇంక్రిమెంట్ కట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవినీతికి పాల్పడిన, ప్రభుత్వ సంస్థల్లో బినామీలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల స్థాయి అధికారులపై మూడవ వ్యక్తి ప్రభావం ఉండకూడదని, చర్యలు తీసుకున్న సమయంలో సిఫార్సులు చేస్తే పరిస్థితి మరింత కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ వివరాలను తెలుసుకున్నారు.

మనబడి నాడు–నేడు పనుల్లో జాప్యం వద్దు

మనబడి నాడు–నేడు రెండవ విడత పనుల్లో జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.ఎస్ఎస్ఆర్ ధరలతో సంబంధం లేకుండా స్థానిక మార్కెట్ ధరలకు అనుగుణంగా సామగ్రి కొనుగోలు చేయాలని సూచించారు. పాడేరు నియోజకవర్గంలో నిర్దేశించిన ప్రకారం పనులు జరగడం లేదని, చింతపల్లి మండలంలో రూ.80 లక్షలు, జి.కే.వీధిలో రూ.55 లక్షలు, కొయ్యూరులో రూ.21లక్షలు, జి.మాడుగులలో రూ.కోటి నిధులు ఖర్చు చేయాల్సి ఉందన్నారు.

ఇందుకు సంబంధించిన పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డీఈవో డాక్టర్ రమేష్,గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈఈ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

ఏకలవ్య పాఠశాల ప్రారంభం

వర్చువల్ విధానంలో ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

చింతూరు: మండలంలోని లక్కవరంలో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖపట్నం నుంచి వర్చువల్ విధానంలో ఆదివారం రాత్రి ప్రారంభించారు. కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రూ 22.5 కోట్లతో ఈ పాఠశాలను నిర్మించారు. చింతూరు మండలానికి ఏకలవ్య పాఠశాల మంజూరైనా భవనం లేకపోవడంతో ప్రస్తుతం వీఆర్‌పురం మండలం కుందులూరులో పాఠశాలను నిర్వహిస్తున్నారు. తాజాగా లక్కవరంలో భవన నిర్మాణం పూర్తయి ప్రారంభం కావడంతో త్వరలోనే ఇక్కడ పాఠశాల నిర్వహణ కొనసాగనుంది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు గల ఈ పాఠశాలలో ప్రస్తుతం 116 మంది బాలికలు, 120 మంది బాలురు విద్యనభ్యసిస్తున్నారు. 22 మంది టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు.

అధునాతన హంగులతో...

లక్కవరంలో ఏకలవ్య పాఠశాలను అధునాతన హంగులతో నిర్మించారు. పాఠశాల ప్రధాన భవనంతో పాటు 16 క్లాస్‌రూంలు, అధునాతనంగా కిచెన్ దానికి అనుసంధానిస్తూ డైనింగ్‌హాల్ నిర్మించారు. మరోవైపు బాలురు, బాలికలకు రెండు హాస్టల్ భవనాలు, వార్డెన్ క్వార్టర్లు కూడా నిర్మించారు. పాఠశాల ఆవరణంతా సిమెంటుతో ట్రాక్, పాఠశాలకు ప్రహరీ ఏర్పాటుచేశారు. త్వరలోనే రెండో విడతలో సిబ్బంది నివాస గృహాలు కూడా నిర్మించనున్నారు.



లక్కవరంలో నిర్మించిన ఏకలవ్య పాఠశాల

పోలవరం నిర్వాసితుల దీక్ష విరమణ

చింతూరు: ముంపు జాబితాలో చేర్చాలని కోరుతూ 12 రోజులుగా స్థానిక ఐటీడీఏ వద్ద నిరాహార దీక్ష చేపట్టిన వీఆర్ పురం మండలం రామవరానికి చెందిన పోలవరం నిర్వాసితులు సోమవారం దీక్షను విరమించారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు వారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. ఆయన మాట్లాడుతూ ముంపు జాబితాలో తమ పేర్లు నమోదు కావడంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారని, వారికి తగిన న్యాయం చేయాలన్నారు. అనంతరం వారు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందచేశారు. ఎంపీపీ లక్ష్మి, సర్పంచ్ బుచ్చమ్మ, సురేష్ తదితరులున్నారు.

రిసార్ట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి

ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

చింతపల్లి: పర్యాటక ప్రాంతమైన లంబసింగిలో రిసార్ట్స్ నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో దాదాపు 60కు పైగా రిసార్ట్స్ నిర్వహిస్తున్నట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ఎటువంటి సంఘటనలు జరిగినా నిందితులను సునాయాసంగా పట్టుకోవచ్చునన్నారు. బస చేసేందుకు వచ్చే ప్రతి ఒక్కరి పేరు రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు ఆధార్ కార్డును పరిశీలించి నమోదు చేయాలన్నారు. మద్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. పదే పదే పర్యాటకుల ముసుగులో వచ్చే వారిని గుర్తించి తమకు సమాచారం అందించాలని సూచించారు. డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయవద్దని ఆయన హెచ్చరించారు. తమ బృందాలు అకస్మికంగా తనిఖీలకు వస్తుంటాయని మద్యంతో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రిసార్ట్స్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలు నిలుపుదల చేయాలన్నారు. చెరువులవేనం కొండకు పర్యాటకులను తీసుకువెళ్లే జీపులు కండీషన్‌లో ఉండాలన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్లకు లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పరిమితికి మించి పర్యాటకులను ఎక్కించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్‌ఐ మహ్మద్ షరీఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

1500 లీటర్ల పులుపు ధ్వంసం

కొయ్యూరు: జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ స్వామినాయుడు సమక్షంలో సోమవారం ఆడాకుల శివారు ప్రాంతాలో సారా బట్టీలపై దాడులు చేసి 1,500 లీటర్ల పులుపును ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ రాజారావు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి సారా తయారీకి వినియోగించే పులుసు ధ్వంసం చేసి, సామగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసుల పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

చింతూరు: వీఆర్ పురం, చింతూరు మండలాల నడుమ రెండేళ్లుగా నిలిచిపోయిన బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. ఈ రూటులో బస్సు సర్వీసులు నడపకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సోమవారం సాక్షిలో 'ఇంకెన్నాళ్లీ ఇక్కట్లు' అనే శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు ఈ రూటులో సోమవారం నుంచి బస్సు సర్వీసులను పునరుద్ధరించారు. గోకవరం డిపోకు చెందిన బస్సులు రాజమండ్రి, కాకినాడ నుంచి రాకపోకలతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ డిపోకు చెందిన బస్సులను కూడా పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.



చింతూరు, వీఆర్ పురం రూటులో ప్రయాణిస్తున్న రాజమహేంద్రవరం డిపో బస్సు

ట్రైకార్ చైర్మన్‌కు ఆత్మీయ సన్మానం



పెద్దపాలంలో ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

పాడేరు రూరల్ : ఐనాడ పంచాయతీ పెద్దపాలం గ్రామాన్ని ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు సోమవారం సందర్శించారు. ట్రైకార్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. యువతకు వాలీబాల్ కిట్లను ఆయన అందజేశారు. స్థానికులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. టెలికాం బోర్డు అడ్వైజరీ బోర్డు సభ్యులుత్రినాథ్, సందీప్, నాయకులు సింహాచలం, రాంబాబు, నవీన్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.